క్లుప్తంగా

కల్లూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం


తాతయ్య


వెంకటసిద్ధులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం కల్లూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా పోకల తాతయ్య, కార్యదర్శిగా వెంకట సిద్ధులు, కోశాధికారిగా ప్రకాష్, ఉపాధ్యక్షులుగా ఇషాన్, రాజేంద్ర, లయన్స్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్‌గా రాజారెడ్డి, మీడియా అధ్యక్షుడిగా సుధాకర్, సేవా కార్యక్రమాల అధ్యక్షుడిగా ఆర్ఎస్ రాజన్, డైరెక్టర్లుగా లావణ్య, అక్షాద్ బేగంను ఎన్నుకున్నారు. జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ ఈ ఎన్నికను పర్యవేక్షించారు.

డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేయండి

పుంగనూరు: స్థానిక రామసముద్రం రోడ్డులోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో మూడేళ్ల కాలవ్యవధితో బీఎస్సీ, బీకాం, సీఏ, బీఏ కోర్సులలో విద్యార్థులను చేర్చుకుంటున్నట్టు చెప్పారు. సువిశాలమైన కళాశాల, క్రీడామైదానం, లైబ్రరీతో పాటు పలు వసతులు ఉన్నాయని, అంతేకాకుండా కళాశాలలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జేకేసీలో ఉచిత శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మారెమ్మకు రాహుకాల పూజలు


ప్రత్యేక పూజలందుకున్న విరుపాక్షి మారెమ్మ

పుంగనూరు: స్థానిక బస్టాండులోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల, అమావాస్య, పాడ్యమి పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి గుమ్మడికాయలు, నిమ్మకాయలు, పచ్చి మిరపకాయలు, పెరుగన్నం సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే దిష్టి దోష నివారణ పూజలు చేశారు.

పెరిగిన కూరగాయల ధరలు

సదుం: వేసవి ప్రభావంతో కూరగాయల సాగు తగ్గడంతో వాటి రేటు అమాంతంగా పెరిగింది. శుక్రవారం వారపు సంతలో టమాటాలు కిలో రూ.40, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.80, వంకాయలు రూ.60, బెండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.80, ఎరగడ్డలు రూ.40 పలికాయి. ఇక, గత వారం రూ, 100 పలికిన కొత్తమీర కట్ట మాత్రం రూ. 20 కే లభించింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కొన్ని రోజులలో ధరలు తగ్గే అవకాశం ఉందని వ్యాపారస్తులు తెలిపారు.

పశుగ్రాసంతో వరుసగా పేర్చిన పాతర గడ్డి



బంకమట్టితో పశుగ్రాసాన్ని కప్పేసిన దృశ్యం



పచ్చగడ్డికి ప్రత్యామ్నాయం పాతరగడ్డి

- పాడి రైతులకు ఎంతగానో మేలు
- పశు పరిశోధన కేంద్రాన్ని సంప్రదిస్తే మరింత ఉపయుక్త సమాచారం


పశుగ్రాసాన్ని ముక్కలు చేసి తొట్టిలో నింపుతున్న దృశ్యం

పలమనేరు: వ్యవసాయ పొలాలు లేకుండా పశువులను సంరక్షించే రైతులకు మేత కష్టాలు తప్పడం లేదు. వీరు పచ్చగడ్డి కోసం కష్టపడాలి లేదా ఎండు గడ్డిని కొనుక్కోవాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు పాతరగడ్డి (సైలేజ్ పిట్స్) కార్యక్రమం ఎంతగానో మేలు కలిగిస్తుందని పలమనేరు పశు పరిశోధనా కేంద్రం సీనియర్ సైంటిస్ట్ వేణు చెప్పారు. పాడి రైతులు పాతర గడ్డి యూనిట్లను తమ ఇళ్ల లేదా పొలాల వద్ద ఏర్పాటు చేసుకుంటే పశువులకు పౌష్టికాహార మేత అందుబాటులోకి వస్తుంది. దీన్ని ఎలా చేయాలో సైంటిస్ట్ వివరించారు.

సైలేజ్ పిట్స్‌ను ఎలా నిర్మించుకోవాలంటే..!

ఈ ప్రాంతంలో రైతులు పశుపోషణపై ఆధారపడి ఎక్కువమంది ఉన్నారు. కనీసం పది పాడి ఆవులు ఉన్న రైతు ఓ ఏడువేలు ఖర్చు చేస్తే మూడు నెలలకు సరిపడా పచ్చగడ్డిని సిద్ధం చేసుకోవచ్చు. తొలుత దీనికోసం పన్నెండు అడుగుల లోతు, పదిహేను అడుగుల పొడవుతో గుంతను తవ్వాలి. అప్పటికే సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, జొన్న, సజ్జలు, లేదా బహు వార్షిక పశుగ్రాసాలను పూత దశలో లేదా గింజ దశలో ఉన్నప్పుడు కత్తిరించుకోవాలి. ఇందులో శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని చాప్‌కట్టర్‌తో ఇంచీ పొడవు ముక్కలుగా చేసి సైలేజ్ పిట్‌లో రెండు అడుగుల ఎత్తువరకు లేయర్లుగా నింపుకోవాలి. ప్రతి వరసపై ఒకశాతం బెల్లం నీళ్లు, ఒకశాతం రాళ్లఉప్పును చల్లాలి. వీటితో పశుగ్రాసం తియ్యగానూ, నిల్వ ఉంచుకునే గుణం పెరుగుతుంది. శిలీంధ్రాలు, బూజులతో గ్రాసం పాడవకుండా ఉంటుంది. ప్రతి వరుసలో గాలిబుడగలు లేకుండా బాగా అణగదొక్కాలి. ఇలా చేస్తూ పిట్ పూర్తిగా మునిగిపోయాక పైదశ వరకు నింపిన వరుసల్లోకి గాలి ప్రవేశించకుండా చెత్తను కప్పి బంకమట్టితో మూత పెట్టాలి. ఎనిమిది వారాల తర్వాత ఈ గడ్డిని ఓ వైపు నుంచి తెరచి కావాల్సినంత పశుగ్రాసాన్ని పొందవచ్చు. ఇది రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి సబ్సిడీలు సైతం అందుబాటులో ఉన్నాయి. సైలేజ్ పిట్స్ గురించి ఏదేనీ అనుమానాల నివృత్తి కోసం పలమనేరు సమీపంలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పశు పరిశోధన కేంద్రం సైంటిస్ట్, అధికారులను సంప్రదించవచ్చు.

పెన్షనర్ల సమస్యలపై స్పందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

పలమనేరు: పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలపై అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం స్పందించాలని స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెన్షన్‌పై ఆధారపడి బతికే త మ కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ నాయకులు వెంకటక్రిష్ట, రత్నారెడ్డి, గురుమూర్తి పాల్గొన్నారు.

'నీట్'కు ముగ్గురి ఎంపిక




నిఖిల్ శ్రీనివాసన్, రంజిత్, శంకర్

కుప్పం రూరల్: కుప్పం జూనియర్ కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు నీట్‌కు ఎంపికైనట్లు బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు, చైర్ పర్సన్ శాంత తెలిపారు. కళాశాలలో బైపీసీ చదువుతున్న నిఖిల్ శ్రీనివాసన్ 605/720, రంజిత్ 557/720, శంకర్ 550/720 మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరు మెడికల్ సీటుకు అర్హత పొందినట్టు చెప్పారు. వారిని అభినందించారు.

బీఫ్ దుకాణాన్ని తొలగించరూ!

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని బోడిరెడ్డిపల్లె కాలనీలో ఇటీవల ఏర్పాటు చేసిన బీఫ్ దుకాణం నుంచి వెలువడుతున్న దుర్వాసన కారణంగా చాలా ఇబ్బందిగా ఉందని, ఆ దుకాణాన్ని తొలగించాలని ఆ ప్రాంత వాసులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి విన్నవించారు. ప్రభుత్వ స్థలంలో ఈ దుకాణాన్ని ఏర్పాటు చేశారని ఆయన దృష్టికి నివేదించారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

బంగారుపాళెం: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే భాండాగారాలని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ధనంజయరాజు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతే కాకుండా వినోదాన్నిచ్చే సందేశాత్మక పుస్తకాలు కూడా ఉంటాయన్నారు. ఉచితంగా అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయాలి

పలమనేరు: తెలుగు భాషాభివృద్ధి కోసం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కృషి చేయాలని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు కోరారు. తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షులు, ప్రస్తుత అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌ను శుక్రవారం అవనిగడ్డలోని ఆయన స్వగృహంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నూతన విద్యావిధానం, పాఠశాల స్థాయిలో మాతృభాష ఆవశ్యకతపై ఆయనతో చర్చించినట్టు పేర్కొన్నారు. ఆయన వెంట సమితి కార్యదర్శి పుష్ప పాల్గొన్నారు.

ఉసిరి.. లాభాల సిరి!


ఉసిరితోట


ఉసిరి చెట్టు

పోషకాల సిరి ఉసిరి రైతులకు సిరులు కురిపిస్తోంది. ఒక్కసారి సాగు చేస్తే 40 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. సాగు ఖర్చులు కూడా తక్కువే. పంట సాగుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.18 వేల రాయితీ కూడా ఇస్తోంది. దీంతో మండలంలోని రైతులు ఉసిరి తోటలు సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు.

–విజయపురం

- రైతుకు అదనపు ఆదాయం
- ఒక్కసారి సాగుచేస్తే 40 ఏళ్ల వరకు దిగుబడి

పండించే పంట దిగుబడి లేదని, దిగుబడి బాగా వచ్చినా ధర పలకలేదని ఆందోళన చెందే రైతును ఉసిరి ఆదుకుంటోంది. ఏడాదికి రెండుసార్లు ఫలసాయాన్ని అందిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇస్తోంది. ఉసిరిలో ఎక్కువగా ఔషధ గుణాలు ఉండడం, రోగనిరోధక శక్తిని కలిగిస్తుండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో ఐదు ఉసిరి మొక్కలయినా నాటాలని పూర్వీకులు చెబుతారు. శరీరంలో రోగ నిరోధకశక్తి పెరగాలంటే సి – విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లూ, కూరగాయలూ తినాలి. కరోనా పుణ్యమా అని ఈ విషయం మాటలు సరిగ్గా రాని పసివాళ్ల నుంచి వృద్ధుల వరకూ తెలియడంతో ఉసిరి సాగుపై ఆసక్తి నెలకొంది. మండలంలోని విజయపురం, మిట్టూరు, శ్రీహరిపురం, కాకవేడు ప్రాంతాల్లోని రైతులు ఉసిరి పంటను సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ఉసిరి సాగవుతోంది. రైతులు తమిళనాడులోని తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకుని నాటుకుంటున్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే రెండేళ్లకు కాపు వస్తుంది. ఏడాదికి రెండుసార్లు ఫలసాయం అందుతోంది. ఎకరాకు 200 మొక్కలు నాటి సాగుచేసిన రైతులు చెట్టు పెరుగుదలను అనుసరించి ఎకరాకు రెండు నుంచి 5 టన్నుల వరకు దిగుబడిని పొందవచ్చు. ఉసిరి 30 నుంచి 40 ఏళ్ల వరకు ఫలసాయం అందుతుందని ఉద్యానవన అధికారులు తెలుపుతున్నారు. ఉసిరి చెట్టు నీటి ఎద్దడిని చాలా వరకు తట్టుకుంటుంది. చీడపీడలు, తెగులు ఎక్కువగా ఆశించవు. ఈ కారణంగా సాగు ఖర్చు తగ్గుతుంది. రాబడిలో ఖర్చు 10 శాతం మాత్రమే ఉంటుంది. డిమాండ్‌ను బట్టి టన్నుకు రూ.30 వేల నుంచి 50 వేలు వరకు ధర పలుకుతుంది.

మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు తరలింపు

నగరి, విజయపురం మండలాల్లో సాగు చేసే ఉసిరి మన రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, తెనాలితో పాటు తమిళనాడులోని చెన్నై, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో గల ఫ్యాక్టరీలకు ఎగుమతి అవుతోంది. ఉసిరితో మందులు, సిరప్‌లు, ఆయిల్, సోపు, ఊరగాయలు తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తారు.


ఉసిరికాయలు

ఉసిరి సాగు లాభాలనిస్తోంది

నేను పదిహేనేళ్ల క్రితం నుంచి ఉసిరి సాగు చేస్తున్నాను. తమిళనాడులోని తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకున్నాను. ఏడాదికి రెండు సార్లు కాపు వస్తోంది. తెగుళ్ల, చీడపీడల సమస్య ఎక్కువగా ఉండదు. పంట మధ్య కలుపు పెరగకుండా చూసుకుంటూ, చెట్లను పరిశీలించి కొంతమేరకు తెగులు రాకుండా మందులు స్ప్రే చేసుకుంటే చాలు. మంచి దిగుబడి చూడవచ్చు. డిమాండ్‌ను అనుసరించి ఎకరాకు రూ.లక్ష వరకు లాభం వస్తుంది.

– జయరామయ్య, విజయపురం మండలం

దాడుల సంస్కృతి మంచిది కాదు


వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ రెడ్డి

- మీ ప్రతాపాన్ని ప్రజలకు మేలు చేయడంపై చూపాలి
- సచివాలయాల్లో జగన్ ఫొటోలను దహనం చేయడం సరికాదు
- పలమనేరు రూరల్ మండల వైఎస్సార్ సీపీ నేతలు

పలమనేరు: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచినంత మాత్రాన టీడీపీ మూకలు దాడులు చేసే విష సంస్కృతికి దిగడం ఎంతమాత్రమూ మంచిది కాదని పలమనేరు రూరల్ మండల వైఎస్సార్ సీపీ నాయకులు హితవు పలికారు. ఎన్నికల అనంతరం మండలంలో సచివాలయాలపై టీడీపీ కార్యకర్తల దాడుల విషయంతో స్థానిక పార్టీ కార్యాలయంలో వారు శుక్రవారం కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు విశ్వనాథ రెడ్డి, రంగన్న, చెంగారెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో తమ పార్టీ ఓటమి చవిచూసినా ఓటు బ్యాంకును కాపాడుకున్నామని, ఉద్యోగస్తులు మాత్రమే తమ పార్టీకి వ్యతిరేకించారన్నారు. తాజాగా కొందరు టీడీపీ కార్యకర్తలు గొల్లపల్లె సచివాలయంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేయడం మంచిది కాదన్నారు. ఇలాంటి చర్యలను జనం ఎంతమాత్రమూ సమర్థించరన్నారు. వైఎస్సార్‌సీపీ వారిపై దాడులు, ఆస్తులకు నష్టం, ప్రభుత్వ భవనాలపై దాడులు లాంటివి కొనసాగిస్తూ పోతే ప్రజల్లో వ్యతిరేకత మూటకట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గెలిచిన కూటమి ప్రధాన నేతలు కూడా ఇప్పటివరకూ ఎక్కడా దాడులపై పెదవి విప్పకపోవడం చూస్తే దాడులకు వారి మద్దతు, ప్రోత్సాహం ఉందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇకనైనా వీటికి స్వస్తి పలికి, హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలన్నారు. అలాగే గెలిచిన అభ్యర్థులకు అభినందిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో నాయకులు రాజారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడుల సంస్కృతి మాది కాదు

ఇలా ఉండగా, వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంపై కొలమాసనపల్లె టీడీపీ నాయకులు సెల్వరాజ్ తది తరులు ప్రతిస్పందించారు. వారు మాట్లాడుతూ, తాము గెలిచినా ప్రజలకు బాధ్యులుగా ఉంటామన్నారు. దాడుల సంస్కృతి తమది కాదని, ఇలాంటి దాడులను తమ పార్టీ ప్రోత్సహించదని పేర్కొన్నారు.

దాడులు చేయడం అప్రజాస్వామ్యం


మొగసాల క్రిష్ణమూర్తి

పలమనేరు: ఎన్నికల్లో అధికారంలోకి వచ్చినందున టీడీపీ, కూటమి నాయకులు ఇక తమకు తిరుగులేదంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పనిగట్టుకుని దాడులు చేయడం, అవమానించడం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల క్రిష్ణమూర్తి హితవు పలికారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారమన్నారు. ఇలా ఉద్దేశపూర్వకంగా, కక్ష కట్టి దాడులు చేయడం అప్రజాస్వామ్యమని నిరసించారు. ప్రజలు కూడా ఇదంతా గమనిస్తున్నారని, ఇలాగే వ్యవహరిస్తే ప్రజా వ్యతిరేకత చవిచూస్తారన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చగొట్టినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సంయమనాన్ని పాటించాలని కోరారు.

అధైర్య పడొద్దు..పార్టీ అండగా ఉంటుంది

గంగవరం: ఎన్నికల్లో గెలవగానే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడం హేయమైన చర్య అని ఆ పార్టీ మండల కన్వీనర్ మోహన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వంలోకి వచ్చిన పార్టీ నాయకత్వం పనికట్టుకుని దాడులు, దౌర్జన్యాలు లాంటి చర్యలకు పాల్పడటం ఎంతమాత్రమూ మంచిది కాదన్నారు. ఇలాంటి హింసోన్మాద చర్యలకు టీడీపీ అధిష్టానం అడ్డుకట్ట వేయకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత చవిచూడక తప్పదన్నారు.

గ్రంథాలయ పోటీల విజేతలకు బహుమతులు


సర్టిఫికెట్స్, బహుమతులతో విద్యార్థులు

వి.కోట: విద్యార్థులు పుస్తక పఠనం ఒక వ్యాపకంగా చేసుకుని గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివితే ఉన్నత విజయాలను పొందవచ్చని కళాభారతి సంస్థ అధినేత రఘుపతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం,, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది మహ్మద్ వహాబ్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం

పలమనేరు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నెల రోజుల వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్ శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను అందజేశారు.


సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు పొందిన చిన్నారులు

'నీట్'లో ఐఆర్ఎం విద్యార్థి ప్రతిభ


జీవనను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ దయానిధి

కుప్పం: స్థానిక ఐఆర్ఎం కళాశాలలో ఇంటర్ మీడియెట్‌లో బైపీసీ పూర్తి చేసిన విద్యార్థిని జీవన నీట్ పరీక్షలో ప్రతిభ కనబరచినట్లు కళాశాల చైర్మన్ దయానిధి తెలిపారు. ఇంటర్‌లో జీవన 985 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థినికి కళాశాల ప్రాంగణంలో ఐఐటీ, నీట్ పరీక్షలకు శిక్షణ పొందింది. ఈ ఏడాది మే నెలలో జరిగిన నీట్ పరీక్షలో 583 మార్కులు సాధించి మెడికల్ సీటు కైవసం చేసుకుంది. గుడుపల్లె మండల కాడేపల్లెకు చెందిన జీవన తొలి ప్రయత్నంలోనే మెడికల్ సీటు సాధించడంతో దయానిధితో పాటు పలువురు అభినందించారు.

ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించిన టీడీపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ కార్యాలయ ఆవరణలోని టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ, తమ పార్టీ అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సీఈఓ గ్లోరియాను కలిసి కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు సీఈఓతో సమావేశమయ్యారు. జెడ్పీ పరిధిలో అటెండర్ నుంచి ఏఓల వరకు ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.